సాక్షి కామారెడ్డి

శనివారం : 23 : నవంబర్ : 2024



చెడ్డపేరు తెస్తున్నారనే..

కొందరు నేతలు పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారనే పక్కన పెట్టామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



మిల్లులకు తరలించాలి

రైతులనుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

32.7 /12.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి'



కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని డీటీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు, వార్డెన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కామారెడ్డి టౌన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఇందుకోసం కామారెడ్డి డివిజన్‌లో 4, బాన్సువాడ డివిజన్‌లో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో పురస్కారాలు, సన్మానం కోసం ఈనెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి చందర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సామాజిక కార్యకర్త, రోల్‌మాడల్, ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ క్రీడాకారుడు, ఉత్తమ మహిళ, క్రియేటివ్ చైల్డ్, ఎన్జీవో, పారిశ్రామికవేత్త పురస్కారాలు ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు దివ్యాంగుల జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'రాష్ట్ర స్థాయిలో గుర్తింపు'



రామారెడ్డి: కథలతో గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని డీఈవో రాజు విద్యార్థులను అభినందించారు. శుక్రవారం గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'గిద్ద రాధాయపల్లి బడి పిల్లల కథల సింగిడి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పుస్తకంలోని కథల గురించి వివరించారు. ఈ పుస్తకంలోని నలుపు – తెలుపు కథకు తెలుగు సాహిత్య అకాడమీ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీసి కథలు రాస్తున్నందుకు సంతోషంగా ఉందని హెచ్ఎం కన్నయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల విద్యాధికారి ఆనంద్‌రావు, సదాశివనగర్ మండల విద్యాధికారి యోసెఫ్, కవులు వీఆర్ శర్మ, సుంకటి నరేష్, నాయకులు మోహన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నెలల తర్వాత దిశ!

- నేడు కలెక్టరేట్‌లో సమావేశం
- ఎంపీ హోదాలో తొలిసారి పాల్గొననున్న సురేశ్ షెట్కార్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. సమావేశం కోసం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు సురేశ్ షెట్కార్ ఈ సమావేశానికి హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించనున్నారు. గతేడాది ఆగస్టులో అప్పటి ఎంపీ బీబీ పాటిల్ అధ్యక్షతన దిశ సమావేశం జరిగింది. 15 నెలల అనంతరం కొత్త ఎంపీ షెట్కార్ అధ్యక్షతన మళ్లీ సమావేశం జరగనుంది. సమావేశంలో ఎమ్మెల్యేలు పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

సీడీఎంఏకు ఆర్మూర్ మున్సిపల్ మేనేజర్ సరెండర్

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న హయ్యూమ్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు సీడీఎంఏ కార్యాలయానికి సరెండర్ చేశారు. పై అధికారితో అనుచితంగా ప్రవర్తించడంతో ఈ చర్య తీసుకున్నారు.



రైల్వే స్టేషన్ ఆధునికీకరణ నమూనా చిత్రం

చురుకుగా ఆధునికీకరణ

- మారనున్న కామారెడ్డి రైల్వేస్టేషన్ రూపురేఖలు
- రూ.39.90 కోట్లతో జోరుగా అభివృద్ధి పనులు
- రైల్వే లైన్ డబ్లింగ్ చేయాలని కోరుతున్న ప్రజలు



కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పనులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. మరో ఏడాది కాలంలో పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. కామారెడ్డి రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్కీంలో భాగంగా రూ.39.90 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. గతేడాది ఆగస్టు 6న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మంజూరైన నిధులతో ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తున్నారు. స్టేషన్ ప్రధాన ప్లాట్‌ఫాంపై ఉన్న రేకులను తొలగించారు. దానిని ఆధునికీకరించడంతో పాటు స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. వెనుకభాగం నుంచి ముందుభాగం వరకు భారీ ఇనుప పిల్లర్లను వేశారు. ఎస్కలేటర్లు, వంతెన ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అలాగే స్టేషన్ ముందు భాగాన్ని ఆధునికత ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.

డబ్లింగ్ అయ్యేనా?

సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్ల నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్ వరకు రైల్వే లైన్ విద్యుదీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో విద్యుత్‌తో నడిచే రైలు ఇంజన్లు తిరగడం మూలంగా రైళ్ల వేగం పెరిగింది. హైదరాబాద్‌కు వెళ్లేవారికి పలు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే నిజామాబాద్, నాందేడ్‌కు రైలు సౌకర్యాలు మరింత మెరుగయ్యాయి. దేశ వాణిజ్య రాజధాని ముంబయికి నిత్యం దేవగిరి ఎక్స్‌ప్రెస్ దశాబ్దాల కాలంగా నడుస్తోంది. కామారెడ్డి నుంచి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల వరకూ రైళ్లు తిరుగుతాయి. అయితే డబ్లింగ్ పనులు పూర్తి కాకపోవడంతో సమయం వృథా అవుతోంది. ఈ మార్గంలో డబ్లింగ్ చేయాల్సిన అవసరం ఉంది.

పెరిగిన రాకపోకలు..

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా ఎదగడంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. రియల్ ఎస్టేట్, ఫార్మా వ్యాపారం, రైస్‌మిల్ ఇండస్ట్రీకి కామారెడ్డి అడ్డాగా మారింది. దీంతో పట్టణానికి వచ్చిపోయే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అలాగే కామారెడ్డి రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తర, దక్షిణ భారతాల మధ్య నిత్యం 55 వరకు రైళ్లు తిరుగుతుంటాయి. రోజూ కామారెడ్డి స్టేషన్‌లో కనీసం 1,500 మంది టికెట్లు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగులు చాలా మంది హైదరాబాద్ నుంచి కామారెడ్డికి అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. కామారెడ్డిలో పండ్లు, ఫలాలు, కూరగాయలు, ఇతర సామాన్లు అమ్ముకోవడంతో పాటు, కూలీ పనులు, నిర్మాణ రంగ పనులకు అక్కన్నపేట, మిర్జాపల్లి, భిక్కనూరు, ఉప్పల్‌వాయి, సిర్నాపల్లి, ఇందల్వాయి స్టేషన్ల ద్వారా వందలాది మంది వచ్చి పనులు చేసుకుని తిరిగి రైళ్లలోనే సొంతూళ్లకు వెళతారు. అలాగే గూడ్స్ రైళ్లు పెద్ద సంఖ్యలో వెళుతున్నాయి. గూడ్స్ ద్వారా కామారెడ్డి రైల్వేకు ప్రతి నెలా రూ.2 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది.

ఇరుకు వంతెన, రైల్వే గేటుతో ఇబ్బందులు

కామారెడ్డి పట్టణాన్ని రైల్వే లైన్ రెండుగా విభజించింది. రైల్వే స్టేషనకు ముందు భాగాన పాత పట్టణం, వెనక భాగాన కొత్త పట్టణం ఉంటాయి. అయితే అటూ, ఇటూ నిత్యం వేలాది మంది ప్రజలు తిరుగుతుంటారు. పట్టణంలో ఒకే ఒక్క రైల్వే బ్రిడ్జి ఉంది. అది ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంతెన నిర్మాణ సమయంలో ముందుచూపుతో వ్యవహరించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. రైల్వే బ్రిడ్జీని కూడా విస్తరిస్తే గానీ సమస్య పరిష్కారం కాదు. అలాగే రైలు వచ్చినప్పుడల్లా పట్టణంలోని అశోక్ నగర్‌లో ఉన్న రైల్వే గేటును వేయాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో దిద్దుబాటు చర్యలు

- ఎల్లారెడ్డి నేత సుభాష్‌రెడ్డికి షోకాజ్ నోటీస్
- పార్టీ, ప్రభుత్వ వ్యతిరేక ప్రకటనలపై ఆగ్రహం
- వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా పార్టీకి నష్టం కలిగించే వారి నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేస్తోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ముఖ్య నేతల మధ్య ఏర్పడిన విభేదాల నేపథ్యంలో పార్టీ నాయకుడు సుభాష్‌రెడ్డికి పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి శుక్రవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై వ్యతిరేక ప్రకటనలు చేశారని, సీనియర్లను కాదని పదే పదే పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నించడం, పార్టీ క్యాడర్ మధ్య విభేదాలు తీసుకురావడం, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేయడం, జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్రలో పార్టీ క్యాడర్‌కు రాంగ్ మెసేజ్ వెళ్లేలా వ్యవహరించడం వంటి అంశాలను షోకాజ్ నోటీసులో ప్రస్తావించారు. ఇది పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమేనని పేర్కొన్నారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పష్టం చేసింది. జిల్లాలో ఎల్లారెడ్డి నియోజకవర్గంతో పాటు బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు నడుస్తోంది. పార్టీలో నెలకొన్న విభేదాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం చూపుతాయని గ్రహించిన పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరికొందరికి షోకాజ్ నోటీసులు అందే అవకాశాలున్నాయి. షోకాజ్ నోటీసులకు ఇచ్చే వివరణ ఆధారంగా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సాక్షి కి కృతజ్ఞతలు తెలిపిన రైతు

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: రైతు పొలంలో ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతేడాది జనవరి 15న భిక్కనూరు శివారులోని పొలంలోగల ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగులగొట్టి కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లారు. రామేశ్వర్‌పల్లికి చెందిన రైతు పెద్దోళ్ల శరత్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినా స్పందన లేకపోవడంతో గురువారం డిప్యూటీ సీఎంకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశాడు. రైతు సమస్యపై 'సాక్షి'లో శుక్రవారం వార్త ప్రచురితమైంది. దీనిపై ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ స్పందించారు. వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపజేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ 'సాక్షి'తో మాట్లాడుతూ తాను ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చానన్నారు. రైతు సమస్య తనకు తెలియదన్నారు. 'సాక్షి'లో ప్రచురితమైన వార్తను చూసి స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్ బిగింపజేశానన్నారు. రైతులకు ఏ సమస్య ఉన్నా స్థానిక విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడం వల్లే తన సమస్య పరిష్కారమైందని రైతు పెద్దోళ్ల శరత్ ఆనందం వ్యక్తం చేశారు. 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ కల్యాణ్ చక్రవర్తి, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ సంకీర్త్, లైన్‌మన్ మాణిక్యం పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న సిబ్బంది

కాలభైరవుడికి లక్ష దీపార్చన



లక్ష దీపార్చనలో పాల్గొన్న భక్తులు



దీపార్చనను ప్రారంభిస్తున్న ఈవో ప్రభుగుప్తా

రామారెడ్డి : ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీకాలభైరవుడి జన్మదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. 72 గంటల సంతత ధారాభిషేకం కొనసాగింది. శుకవారం సాయంత్రం 6 గంటలకు లక్ష దీపార్చన ప్రారంభమైంది. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకుడు శ్రీనివాసశర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయానికి దీప శోభ తెచ్చారు. భైరవ నామస్మరణతో ఆలయం మారుమోగింది.

నేడు డోలారోహణం

కాలభైరవ స్వామి జన్మదిన ఉత్సవాల్లో భాగంగా శనివారం డోలారోహణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటలకు ఎడ్లబండ్ల ఊరేగింపు ఉంటుంది. అనంతరం రథోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలలో పాల్గొనడానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లావాసులే కాకుండా ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలనుంచీ భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

'ఆన్‌లైన్ ఎంట్రీని వేగవంతం చేయాలి'

లింగంపేట: ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో వేగంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. సకాలంలో డబ్బులు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సీరియల్ ప్రకారం ధాన్యం తూకం వేయడం లేదని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన సీరియల్ ప్రకారం తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ ఎంట్రీలో లింగంపేట వెనకబడి ఉందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను వెంటవెంటనే నమోదు చేయాలని సీఈవో పెంటయ్యకు సూచించారు. రైస్‌మిల్లర్లు ధాన్యం బస్తాలను త్వరగా అన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్‌గౌడ్, రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కంది పంటపై ఆశలు

- జిల్లాలో 55 వేల ఎకరాల్లో సాగు
- చీడపీడలతో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లా రైతులు కంది పంటపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటివరకు పంట బాగుండడంతో ఆనందంతో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 55,683 ఎకరాల్లో కంది పంట సాగయ్యింది. మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పెసర, పత్తి పంటలలో అంతర పంటగా దీనిని సాగు చేశారు. గాంధారి, లింగంపేట, తాడ్వాయి, సదాశివనగర్, మాచారెడ్డి, మద్నూర్ జుక్కల్ మండలాల పరిధిలో ఈ పంట ఎక్కువగా సాగయ్యింది. గతంలో ఏటా 25 వేల ఎకరాల్లోపు మాత్రమే కంది పంట వేసేవారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంట కావడంతో ఇటీవలి కాలంలో కంది సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది కందిసాగు విస్తీర్ణం ఏకంగా 55,683 ఎకరాలకు పెరిగింది.



మెలకువలు పాటిస్తేనే..

కంది సాగులో ప్రధాన సమస్య చీడపీడల వ్యాప్తి. పూత దశకు రాగానే పురుగు సోకడం మొదలవుతుంది. పురుగు మందుల పిచికారీ విషయంలో ఎల్లవేళలా రైతులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. పూత దశలో బియ్యం గింజల మాదిరిగా ఉండే మరుక పురుగు దాడి చేసి కాయగా మారాల్సిన మొగ్గను తినేస్తుంది. దీని నివారణకు కార్బోసల్ఫాన్ 25 శాతం ఈసీ మందును పిచికారీ చేయాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఆ తర్వాత కాత దశకు రాగానే పచ్చ పురుగు, లద్దె పురుగు, సెమీలూపర్స్ అనే పురుగు రకాలు దాడి చేసే అవకాశాలుంటాయి. వీటి నివారణకు ఇండాక్సికార్బ్, నువాల్యూరాన్‌ల కాంబినేషన్ కలిగిన మందును, హిమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జీ మందును, కోరాంత్రో ఇలోఫ్రిల్ మందును 20 రోజులకు ఒకసారి మార్చిమార్చి పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. రైతులు పురుగు దాడిని గమనిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందడానికి అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేవివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. ఆయన శుక్రవారం తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు. సలహాలిచ్చారు. మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీవో సవితారెడ్డి పాల్గొన్నారు.

రూ.35 వేల విలువైన వెండి వస్తువుల బహూకరణ



భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీనగరేశ్వరస్వామి, సంతోషి మాతలకు భిక్కనూరుకు చెందిన ధన్నారపు రామకృష్ణ–మాధురి దంపతులు రూ.35 వేల విలువ చేసే వెండి వస్తువులను శుక్రవారం బహుకరించారు. నగరేశ్వరస్వామికి వెండి రుద్రాక్షమాల, సంతోషిమాతకు వెండి పుష్పాలమాలను అందించి అలంకరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ బ్యాగుల పంపిణీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న నర్సరీలకు సంబంధించిన ప్లాస్టిక్ బ్యాగులను శుక్రవారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్లకు అందజేశారు. ఒక్కో గ్రామ పంచాయతీకి 4 వేల చొప్పున 25 గ్రామపంచాయతీలకు సంబంధించి నాగిరెడ్డిపేట మండలానికి లక్ష ప్లాస్టిక్ బ్యాగులు వచ్చాయని ఆయన చెప్పారు. మండలంలోని ఫీల్డ్‌అసిస్టెంట్లు మండల పరిషత కార్యాలయానికి వచ్చి ప్లాస్టిక్ బ్యాగులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జి ఏపీవో సాయిలు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగంగౌడ్ ఉన్నారు.

1న మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనునాయక్, కార్యదర్శి బద్దం గోపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 30 నుంచి 80 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. 100, 200 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, 5 కి.మీ రన్నింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్ కుమార్(9440007576), జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి (9949585065)ని సంప్రదించాలని సూచించారు.

డాటాలో తప్పులు రావొద్దు

- సర్వే ఆన్‌లైన్ నమోదు బాధ్యత ఎన్యుమరేటర్లకు..
- ఆపరేటర్లతో డాటా ఎంట్రీ చేయించాలని ఆదేశం
- జిల్లాలో ప్రారంభమైన సర్వే వివరాల నమోదు



మోర్తాడ్‌లో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు, పక్కన కూర్చున్న ఎన్యుమరేటర్లు

మోర్తాడ్(బాల్కొండ): సమగ్ర సర్వే వివరాలను నమోదు చేసిన ఎన్యుమరేటర్లే కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లకు ఆయా శాఖల ఉన్నతాధికారుల నుంచి సందేశాలు అందాయి. శుక్రవారం మండల కార్యాలయాల్లో సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఆరంభమైంది. మండల పరిషత్, రెవెన్యూ, మండల సమాఖ్య కార్యాలయాలు ఇలా అన్ని శాఖల కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లతో సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును ప్రారంభించారు. కార్యాలయాలతో పాటు అందుబాటులో ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోను ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో 40 నుంచి 80 మంది వరకు ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మొదలైంది. రెవెన్యూ డివిజన్‌ల వారిగా ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగింది. మండల పరిషత్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు, రెవెన్యూ, సెర్ప్, గ్రామ పంచాయతీల ఆపరేటర్లతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని డాటా ఎంట్రీ కోసం విధుల్లోకి తీసుకున్నారు. జిల్లాలో 4,69,988 కుటుంబాలు ఉండగా వీరి వివరాల నమోదుకు 3,453 మంది ఎన్యమరేటర్లను నియమించారు. జిల్లాలో దాదాపు సర్వే పూర్తి అయ్యింది. ఎన్యుమరేటర్లు ఇళ్లకు వెళ్లిన సమయంలో కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో కొంత మంది సర్వే నమోదు పెండింగ్‌లో ఉంది. సర్వేలో వివరాలు నమోదు చేయించుకోని కుటుంబాల వారు గ్రామ పంచాయతీలో తమ వివరాలను అందించాలని గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇప్పటికే సేకరించిన సర్వే వివరాలను ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఎస్ఈఈపీసీ సర్వే అనే సాఫ్ట్‌వేర్‌లో డాటా ఎంట్రీని నిర్వహించనున్నారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు కనీసం 25 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. తొమ్మిది రోజుల్లో సర్వే వివరాల నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సర్వే వివరాలను నమోదు చేసిన ఉద్యోగులే డాటా ఎంట్రీ చేయిస్తే తప్పులు దొర్లకుండా ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఏర్పాట్లు చేశాం

సమగ్ర సర్వే వివరాల డాటా ఎంట్రీకి ఏర్పాట్లు చేశాం. అందుబాటులో ఉన్న ఆపరేటర్లతో పాటు బయటవారిని నియమించి డా టా ఎంట్రీ ప్రాంభించాం.మోర్తాడ్ డిగ్రీ కళా శాలలో కూడా డాటా ఎంట్రీకి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆపరేట్లకు శిక్షణ ఇచ్చారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేస్తాం. – తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



డొంకేశ్వర్‌లో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డొంకేశ్వర్/నందిపేట: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. డొంకేశ్వర్, నందిపేటలో కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కాంటా వేసే సమయంలో ఎంత ధాన్యం తూకం వేస్తున్నారు, మిల్లులకు తరలిస్తే తరుగు తీస్తున్నారా అని రైతులను అడిగారు. జిల్లాలో 670 పైచిలుకు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి వారం వరకు కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ధాన్యం రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేవని, లోడింగ్ అన్ లోడింగ్ సజావుగానే జరుగుతోందన్నారు. కేంద్రాల రైతులు నిరీక్షించకుండా క్రమ పద్దతిలో ధాన్యం బస్తాలను తూకం జరిపించాలని, వెంటవెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సన్న ధాన్యానికి సంబంధించి సంపూర్ణ వంటి రకాలను సైతం మండల వ్యవసాయాధికారి ధృవీకరణతో ఫైన్ వైరటీ కింద కొనుగోలు చేయవచ్చని తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు నరేశ్, ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు భరత్‌రాజ్ రెడ్డి, మీసాల సుదర్శన్, నాయకులు గొడిశరం భూమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

చెడ్డ పేరు తెస్తున్నారనే దూరం పెట్టాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో కొందరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంటూ అక్రమాలకు పాల్పడి ప్రజల్లో పార్టీపై విశ్వాసం కోల్పోయే విధంగా ప్రవర్తించి పార్టీకి, ఎమ్మెల్యేకు చెడ్డపేరు తీసుకొస్తున్న వారిని దూరంగా పెట్టామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం బిచ్కుంద మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీనియర్ నాయకులను పట్టించుకోవడం లేదు.. ఎమ్మెల్యే నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నారు.. అంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్‌లో నాపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని అన్నారు. నామినేటెడ్ పదవులు స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదించిన నాయకులకు మాత్రమే వస్తుందన్నారు. సౌదాగర్ అరవింద్‌ను డీసీసీ అధ్యక్షుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, పార్టీకి దూరంగా ఉన్నవారు గ్రూపు రాజకీయాలకు పాల్పడి పార్టీని భ్రష్టుపట్టిన్నారనే దూరంగా పెట్టినట్లు తెలిపారు.

నామినేటెడ్ పదవుల ఎంపికలో కొత్త ఒరవడి

ఆశావహులు నామినేటెడ్ పదవులు ఆశించడం సబబే. ఎవరి మనస్సు నొప్పించకుండా ఏఎంసీ చైర్ పర్సన్ పదవుల ఎంపికపై కొత్త ఒరవడికి నాంది పలికినట్లు ఎమ్మెల్యే అన్నారు. పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి పారదర్శకంగా పదవులను భర్తీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, పుల్కల్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి పటేల్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నిజాంసాగర్(జుక్కల్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పిలుపునిచ్చారు. శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జుక్కల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు కార్యకర్తలకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు రమేష్ దేశాయ్, సాయా గౌడ్, రమేష్ ఉన్నారు.

నియామక పత్రం అందజేత

బిచ్కుంద(జుక్కల్): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీలో నామినేటెట్ సభ్యులుగా ఎంపికై న నౌషానాయక్‌కు శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నియామక పత్రం అందించారు. గిరిజన కోటాలో నౌషానాయక్‌ను సభ్యుడిగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపీ సురేష్ షెట్కార్, సెక్రటరీగా జిల్లా కలెక్టర్, మెంబర్లు ఎమ్మెల్యేలుగా ఉంటారని అన్నారు. జిల్లా అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇచ్చి అభివృద్ధికి కోసం పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు.

రెండు తలల దూడ జననం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో రెండు తలల దూడ జన్మించి మృతి చెందినట్లు రైతు పుట్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గేదె ఈనగా.. ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందిందన్నారు. దూడ మృతి చెందిన విషయమై పశువుల ఆస్పత్రి వైద్యులకు సమాచారం అందించినా వారు గేదెను పరిశీలించలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తలల దూడను చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

పశుగణనకు సన్నద్ధం

- జిల్లాలో పశుగణన చేపట్టేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- 109 మంది ఎన్యుమరేటర్‌లు, 22 మంది సూపర్‌వైజర్ల నియామకం
- ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న ప్రక్రియ



పశుగణనపై ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లకు శిక్షణనిస్తున్న అధికారులు (ఫైల్)



పశుగణన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నాగిరెడ్డిపేట: జిల్లాలో జీవాల లెక్కను తేల్చేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రతి ఐదేళ్లకోకసారి పశుగణన ప్రక్రియ చేపడతారు. గతంలో 2018లో 20వ పశుగణన చేశారు. తిరిగి 2023లో పశుగణన చేపట్టాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలతో అప్పుడు జరపలేదు. ఈ క్రమంలో ఈ యేడు 21వ అఖిల భారత పశుగణన చేపట్టేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు గణన ప్రక్రియ చేపట్టే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కూడ ఇచ్చారు. కాగా జిల్లాలో గల 485రెవెన్యూ గ్రామాల ఆధారంగా పశుగణన ప్రక్రియ చేపట్టనున్నారు. కామారెడ్డి జిల్లాలో పశుగణన ప్రక్రియ చేపట్టేందుకు 109మంది ఎన్యుమరేటర్‌లతోపాటు 22మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఎన్యుమరేటర్‌గా నియమితులైన వారిలో అటెండర్ స్థాయి నుంచి గోపాలమిత్రలతోపాటు ఇతర సిబ్బంది ఉన్నారు. వీరందరికీ విడతల వారీగా శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పశువుల లెక్కింపు, యాప్ వినియోగంతీరు, సేకరించిన సమాచారం ఆన్‌లైన్‌లో నమోదుచేసే తీరును గురించి శిక్షణలో వారికి వివరించారు.

టీకాలతో ఆగిన ప్రక్రియ

జిల్లాలో పశుగణన ప్రక్రియ నాలుగు నెలలపాటు కొనసాగనుంది. జిల్లాలో అక్టోబర్ 25న పశుగణన ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని పశువులకు గాలికుంటు టీకాలు వేసే క్రమంలో గణన ప్రక్రియకు కొంత అంతరాయం ఏర్పడింది. తిరిగి రెండురోజుల క్రితం పశుగణన ప్రక్రియ మొదలయింది. ఫిబ్రవరి 28వ తేది వరకు జిల్లాలో పశుగణన ప్రక్రియ జరగనున్నట్లు పశుసంవర్ధ కశాఖ అధికారులు తెలిపారు.

డిజిటల్ విధానంలో..

జిల్లాలో చేపట్టిన పశుగణన ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ల ద్వారా గణన ప్రక్రియ చేపట్టనున్నారు. గణనలో భాగంగా సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తూ ప్రక్రియను కొనసాగించనున్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన ఒడిశా ప్రజా ప్రతినిధులు



అంకాపూర్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న ఒడిశా ప్రజా ప్రతినిధులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ఒడిశా రాష్ట్ర సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, మండల స్థాయి అధికారులు శుక్రవారం పరిశీలించారు. అంకాపూర్‌లో అంతర పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. అలాగే విత్తన శుద్ధి ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో సమావేశమై అంకాపూర్‌లో వీడీసీ పాత్ర గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో హరికృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి హారిక, కేకే భాజన్న పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



తాడ్వాయిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ఆయన శుక్రవారం తాడ్వాయి, కృష్ణాజీవాడి శివారులో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నిర్దేశిత తేమ శాతం వచ్చేంత వరకు వరిధాన్యాన్ని ఆర బెట్టాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపిన వెంటనే ఎలాంటి తప్పులు లేకుండా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల ఖాతాలో త్వరగా డబ్బులు పడేలా చూడాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, డీసీవో రాంమోహన్, క్లస్టర్ ఆఫీసర్ సాయిలు, కార్యదర్శి నర్సింలు, తదితరులున్నారు.

డిసెంబర్ 18 నుంచి డీఎడ్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 18 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 24 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన మేడుదుల రాజు (35) కలెక్టరేట్‌లోని మైనింగ్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 20న విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే అడ్డుగా వచ్చిన పందిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై బి రాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నదిలో దూకి ఆత్మహత్యాయత్నం

నందిపేట్: నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నది బ్రిడ్జిపై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి ఆయనను కాపాడారు. వివరాలు.. నందిపేట మండలం చింరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ము రాములుకు తన సోదరులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం సాయంత్రం బైక్‌పై ఉమ్మెడ బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. బైక్‌ను ఆపి ఫోన్‌ను అందులో పెట్టి గోదావరిలో దూకాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి అతనిని కాపాడే ప్రయత్నం చేశారు. వరద ఉధృతికి కొట్టుకుపోతూ బ్రిడ్జి కింద పిల్లరును పట్టుకుని ఉన్నాడు. సుమారు గంట తర్వాత స్థానికులు వేసిన తాడును పట్టుకుని బయటకు వచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చేలోపు రాములు నది నుంచి బయటకు వచ్చేశాడు. అయితే ఇటీవల ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఆత్మహత్య ఘటనలు పెరుగుతున్నాయి. దీంతో వంతెనపై పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మహమ్మద్ నగర్‌కు చెందిన కుర్మ మల్లయ్య తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

చెల్లిపై అత్యాచారం

ఖలీల్‌వాడి: నగరంలో ఓ యువకుడు సొంత చెల్లిపై అత్యాచారం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు



బీర్కూర్‌లో నారుమడి

బాన్సువాడ: వానాకాలం పంట పూర్తి కావడంతో యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. కొన్ని చోట్ల నార్లు పోస్తున్నారు. గతేడాది బీర్కూర్ మండలంలో రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టి నిలువున ముంచారు. దీంతో విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- రైతులు విత్తన కొనుగోలు సమయంలో ఒప్పంద పత్రాన్ని తీసుకోవాలి.
- విత్తనం తీసుకునేటప్పుడు గుర్తింపున్న కంపెనీయా కాదా చూడాలి.
- ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాన్ని ఎంచుకోవాలి.
- కంపెనీలిచ్చే విత్తన వివరాలు, రశీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.
- డీలర్లు ఆయా ప్రాంతాలకు అనువైన విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి.
- విత్తనాలు మొలకెత్తకపోతే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్/బోధన్‌టౌన్: పొలాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన, ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలు వాడాలని విద్యుత్ శాఖ డీఈ ముక్తార్ సూచించారు. బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ శివారులోని పసుపువాగు సమీపంలో పంటలు సాగుచేస్తున్న రైతులతో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ప్రతీ రైతు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమకు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ శాఖకు ఏడాదికి చెల్లించాల్సిన రూ.360 తప్పనిసరిగా చెల్లించాలని కోరారు. ఇటీవల రాత్రివేళలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయల్స్‌ను చోరీ చేస్తున్నారని, విద్యుత్‌శాఖ సిబ్బంది ఇప్పటికే రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు సైతం గస్తీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నగేష్, ఏఈ కృష్ణ, ఫోర్‌మెన్ గంగాధర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు జనార్దన్, సుందర్‌రావు, లైన్‌మెన్‌లు యోగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.